తిరుగు ప్రయాణం పట్టిన వలస కూలీలు

నవతెలంగాణ-సదాశివనగర్



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ శివారులో గల గాయత్రి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు నరికిన వలస కూలీలు స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అవుతున్నారు. మూటె ముల్లె సర్దుకొని స్వస్థలాలకు వెళు న్నారు. సంగారెడ్డి, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల నుంచి వస్తుంటారు. సదాశివనగర్ పరిసర ప్రాంతాల్లో సుమారుగా నాలుగు నెలలు చెరుకును నరికి ఫ్యాక్టరీకి తరలించినట్టు తెలిపారు. ఎడ్లబండ్లపై వలస కూలీలు తిరుగు ప్రయాణం చేస్తున్నారు.

ఆకుపై శివుని రూపం

నవతెలంగాణ-మద్నూర్



భాసా బాలకిషన్ అనే కళాకారుడు ప్రతి పండుగ ఉత్సవాలకు రకరకాల చిత్రాలు బాదం ఆకుపైన గీయడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ కళాకారుడు బాదం ఆకుపై శివుని చిత్రం గీసి అందరిని ఆకట్టుకున్నాడు. ఈ కళాకారుడు మద్నూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. బాదం ఆకుపై గీసిన శివుని చిత్రాన్ని చూసి ఆ కళాకారునికి ప్రతి ఒక్కరూ అభినందనలు తెలియజేస్తున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యానికి

నేడే పోలింగ్

ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

- గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీలో 3,55,159 మంది, టీచర్లు ఎమ్మెల్సీకి 27,088 మంది ఓటర్లు
- పట్టభద్రుల ఎమ్మెల్సీకి 56, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 15 మంది అభ్యర్థులు బరిలో...



నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందికి సామగ్రి అందజేత

ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో బరిలో ఉన్న 56 మందికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరులో ఉన్న 15 మందిలో విజేతలను ఎన్నుకునే పోలింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 15 జిల్లాల్లో పోలింగ్ స్టేషన్లు రెడీ చేశారు. అందుకు తగిన ఏర్పాట్ల కోసం ఆయా జిల్లాల కలెక్టరేట్ల నుంచే బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లు, ఇతర సామాగ్రిని బుధవారం నాడే పంపిణీ చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలో మొత్తం 3,551159 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో 27,088 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తంగా ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత ఎన్నికల అధికారులకు ఇప్పటికే పలు జాగ్రత్తలతో కూడిన ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ కంట్రోల్ రూమ్ నుంచే ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేశారు.

నవతెలంగాణ - నిజామాబాద్

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పరిధిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 3లక్షల 55 వేల 159మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 27 వేల 88 మంది ఉన్నారు. ఈ ఉమ్మడి జిల్లాలోని 15 కొత్త జిల్లాల్లో మొత్తం 773 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా అందులో 499 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు, 274 టీచర్స్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మరో 93 కామన్ పోలింగ్ స్టేషన్లు (గ్రాడ్యుయేట్స్, టీచర్స్‌కలిపి) ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను అధికారులు సందర్శించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్ అధికారులకు సిబ్బందికి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్ పై రూట్ ఆఫీసర్లు చర్చించారు. బ్యాలెట్ బాక్సుల లాకింగ్ సిస్టం, సీలింగ్ పై మరోసారి అవగాహన కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంబంధిత ఆఫీసర్లకు సూచించారు. పోలింగ్ మెటీరియల్ సరిచూసుకోవాలని తెలిపారు.

ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల్లోనే...

గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరనుంది. పోలింగ్ అనంతరం అన్ని జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో గల రిసెప్షన్ సెంటర్‌కు తరలించనున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత తో 144 సెక్షన్ అమలు ఉంటుంది. సీసీ కెమెరాల నిఘా తో పాటు కంట్రోల్ రూమ్ నుండి నిరంతరం పర్యవేక్షించనున్నారు.

పోలింగ్ శాతంపైనే అభ్యర్థుల ఆశలు

కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ శాతంపై అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలోని మొత్తం 3.55,159మంది ఓటర్లలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పట్టభద్ర ఓటర్లు 47,981 మంది ఉన్నారు. అదే విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో మొత్తం 270,88 మంది ఉపాధ్యాయుల్లో ఉమ్మడి జిల్లా నుంచే 5762 మంది ఉన్నారు. దీంతో ఈ ఓటర్ల తీర్పుపైనే అభ్యర్థుల భవిత ఆధారపడి ఉంది.

ప్రత్యేక సెలవు ఇవ్వాల్సిందే!

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు తమ ఓటు వినియోగించుకునేందుకు ప్రత్యేక సెలవు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి, వెసులుబాట్లు ఇవ్వాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోరారు.

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఓటర్లు, ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల వివరాలు

జిల్లా	గ్రాడ్యుయేట్ ఓటర్లు	ఉపాధ్యాయ ఓటర్లు	గ్రాడ్యుయేట్ పోలింగ్ కేంద్రాలు	ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు
నిజామాబాద్	31,571	3751	48	33
కామారెడ్డి	16,410	2011	29	25
మొత్తం	**47,981**	**5762**	**77**	**58**

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ఈ ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసేందుకు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానిని చూపించి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకూ గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలి.

కార్మికుల తొలగింపు అక్రమం

- భిక్కనూర్ టోల్‌ప్లాజాలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- చట్టవిరుద్ధ కార్య కార్యక్రమాలకు పాల్పడుతున్న
- సబ్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

భిక్కనూర్ టోల్ ప్లాజాలో అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడుతున్న చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో టోల్ ప్లాజా కార్మికులు ఏసీఎల్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు భిక్కనూర్ టోల్ ప్లాజాలో పనిచేస్తున్న 77 మంది కార్మికులు ఉండగా వారిలో నుండి అకారణంగా 38 మందిని తొలగించారన్నారు. వీరికి గత 9 ఏండ్లుగా పిఎఫ్, ఈఎస్ఐ అమలవుతుందన్నారు. కొత్తగా వచ్చిన తాడేపల్లిగూడెం నుంచి టిపిఆర్ కంపెనీ నుండి మధ్యవర్తి కాంట్రాక్టర్ భోగేశ్వరరావు, మేనేజర్‌గా ప్రకాష్ ఉన్నాడనీ తెలిపారు. కాంట్రాక్టర్ కార్మికులను అనేక ఇబ్బందులు గురిచేస్తున్నాడని అన్నారు. కార్మికులను అకారణంగా తొలగించడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని కార్మికుల కుటుంబాల పొట్ట కొట్టొద్దన్నారు. ఇప్పటికైనా టోల్ ప్లాజా యజమాన్యం మధ్యవర్తితో కాకుండా నేరుగా వచ్చి స్థానిక ప్రజలకు, కార్మికులకు న్యాయం జరిగే విధంగా చూడాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా నాయకుడు రాజనర్సు, టోల్ ప్లాజా సిబ్బంది కె, నర్సాగౌడ్, ఎం రాజశేఖర్, జి ప్రభాకర్, ఎన్ రాజు, పి నరేష్, పనస నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంబార్ గిన్నెలో పడి బాలుడు మృతి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

నవతెలంగాణ-భీంగల్ రూరల్



ప్రమాదవశాత్తు సాంబార్ గిన్నెలో పడి మూడేండ్ల బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని ముచ్కూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భీంగల్ గ్రామానికి చెందిన కర్నె చార్విక్(3) తన తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 19న ముచ్కూర్ గ్రామం నందు బంధువుల ఇంట్లో పండగ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఇతర పిల్లలతో ఆడుకుంటుండగా.. కర్నె చార్విక్ ప్రమాదవశాత్తు వేడిగా ఉన్న సాంబార్ భగోనిలో పడ్డాడు. శరీరమంతా కాలిన గాయాలు అయ్యాయి. దీంతో చికిత్స కోసం హైదరాబాద్‌లో ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. మృతుని తల్లి నిహారిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ మహేశ్ తెలిపారు.

టూరిజంలో త్రిలింగ రామేశ్వర ఆలయాన్ని చేర్చుతాం

- భవిష్యత్ తరాలు చర్చించుకునే పనులు చేపడతాం
- ఎమెల్యే మదన్‌మోమన్‌రావు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణ రాష్ట్రంలో టూరిజం జాబితాలోకి త్రిలింగ రామేశ్వర ఆలయాన్ని చేర్చే విధంగా కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం రోజు మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రి లింగ రామేశ్వర ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ప్రారంభమైన ఆలయ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఆలయానికి ఉన్న సున్నాన్ని తొలగించి కెమికల్‌తో ఆలయాన్ని శుభ్రపరచి మరమ్మతులు చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఆలయాల జాబితాలోకి త్రిలింగ రామేశ్వర ఆలయాన్ని చేర్చి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో త్రి లింగ రామేశ్వర ఆలయం గురించి అసెంబ్లీలో చర్చించి ముఖ్యమంత్రికి ఆలయం గురించి వివరిస్తానని చెప్పారు. 1000 సంవత్సరాలు కలిగిన ఆలయానికి మరో వెయ్యి సంవత్సరాలు వచ్చే తరాలు మాట్లాడుకునే విధంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే 15 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం, బాత్రూంలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరి అయ్యే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. తొందర్లోనే ఆలయ అభివృద్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్ర రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, మైనార్టీ అధ్యక్షులు ఇమామ్, యూత్ అధ్యక్షులు శ్రీరామ్ గౌడ్, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు గులాం హుస్సేన్, తాండూరు సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి డివిటి కిష్టయ్య మాజీ సర్పంచ్ సుభాకర్ రెడ్డి, భీమ్ రెడ్డి, మధు, ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, రవి గౌడ్, సంజీవులు, మసూద్, ఆలయ కమిటీ అధ్యక్షులు కొమ్ము దత్తు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో శివరాత్రి

- శివనామ స్మరణతో మారుమోగిన శివాలయాలు
- మద్దికుంట ఆలయాన్ని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/రామారెడ్డి



నిజామాబాద్‌లోని శంభుని ఆలయంలో



రామారెడ్డి : మద్దికుంట ఆలయంలో రథం లాగుతున్న భక్తులు

శివరాత్రి వేడుకలు బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. హరహర మహాదేవ్.. శంభో శంకర అంటూ శివనామస్మరణతో ఆలయాలు మారుమ్రో గాయి. ఉదయం నుంచి శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలా డాయి. ఆయా ఆలయాల కమిటీలు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేపట్టాయి. జిల్లా కేంద్రాలతో పాటు మండలాల్లో, గ్రామాల్లో ఆలయాలు సందర్శకుల తాకిడి నెలకొంది.

రామారెడ్డి మండలంలోని మద్దికుంట తో పాటు అన్నారం, పోసానిపేట్, ఉప్పల్వాయి తదితర గ్రామాల్లో శివాలయాల్లో బుధవారం భక్తుల ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మద్దికుంటలో వెలసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆయలంలో కన్నుల పండువగా రథోత్సవం నిర్వహించారు. ఇక్కడి వేడుకలకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఏ ఎస్ పి చైతన్య రెడ్డి, పోసానిపేట ఆలయాన్ని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్ రావు దర్శించుకున్నారు. వారికి ఆలయ పూజలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆర్టీసీ యాజమాన్యం కామారెడ్డి నుండి మద్దికుంట ఆలయం వరకు ప్రత్యేక బస్సులను నడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ చైతన్య రెడ్డి, సిఐ రమణ, ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో బందోబస్త ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి నరేందర్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు ప్రభాకర్ స్వామి, గణేష్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో నీట మునిగి యువకుడు మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఈత నేర్చుకునేందుకు వెళ్లిన యువకుడు.. స్విమ్మింగ్ పూల్‌లో నీటమునిగి మృతిచెందాడు. అనుమతి లేని స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ కోచ్ లేకుండా నిర్వహకుల ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఈతకు దిగిన యువకుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం నగరంలో బోధన్ రోడ్డులోని సారంగపూర్ (పాత సిఆర్ పిఎఫ్ క్యాంప్) సమీపం గల జూమ్ స్విమ్మింగ్ పూల్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నిజాం కాలనీకి చెందిన సయ్యద్ అష్రఫ్ (22) అతని అన్నతో కలిసి జూమ్ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లారు. అక్కడ స్విమ్మింగ్ కోచ్ లేకపోయినా, అశ్రఫ్ (గాలి బుడగ) ట్యూబ్ ధరించకున్న అతడిని ఈత కొట్టేందుకు అనుమతించారు. యువకుడు లోతుకు వెళ్లి మునిగిపోతుండగా అక్కడ ఉన్నవారు ఎవ్వరికి ఈత రాకపోవడంతో అతడిని కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. అశ్రప్ సోదరుడు అక్కడే ఉండి తన కళ్ల ఎదుటే అతడు మునిగిపోతుండగా కాపాడలేకపోయారు. బాధితులు ఆరవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు జిల్లా ఆసుపత్రిలో మార్చురికి చెరుకుని బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అయితే నిర్వాహకులు మాత్రం పరారీలో ఉండి కేసు రాజీ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

రెండు నెలల క్రితం అనుమతులు లేకుండానే స్విమ్మింగ్ పూల్ ను ప్రారంభించిన నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని దానిని సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రచారంలో ఏఐ

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్'
- నేరుగా ఓటరును పేరుతో పలకరిస్తూ అభ్యర్థి వీడియో సందేశం
- టెలీక్యాంపెయిన్‌తో ఓటర్లకు తప్పని చిరాకు

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్



ఓటర్లకు వాట్సప్‌లో వారి పేరుతో వచ్చిన వీడియో సందేశం

మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్నికల ప్రచారంలో సైతం మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పలు పార్టీలు, అభ్యర్థులు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రచారం చేపడుతున్నారు. తాజాగా జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక అడుగు ముందుకేసి ఏకంగా ఓటరు పేరును నేరుగా పలకరిస్తూ అభ్యర్థి తన వీడియో సందేశం పంపుతున్నారు. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలీజెన్స్) సాయంతో 30 సెకన్ల వీడియో సందేశం ఓటరు వాట్సప్‌కు వస్తుండటం గమనార్హం. ఇక సెల్‌ఫోన్‌కు వచ్చే ఫోన్‌లకు అంతే లేకుండా పోతోంది. తెలియని నెంబర్ నుంచి వచ్చిన ఫోన్‌ను లిఫ్ట్ చేస్తే.. అభ్యర్థి ఓట్లను అభ్యర్థిస్తూ తన వాయిస్ మెసెజ్‌ను పంపతున్నాడు.

ప్రధాన అభ్యర్థులు ప్రచారంలో కొత్త పంథా అనుసరిస్తున్నారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గానికి పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీకి నేడు(27) పోలింగ్ జరగనుంది. ప్రచారానికి తెరపడినప్పటికీ.. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రచార పర్వం కొనసాగించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 56, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా గత కొన్ని రోజులుగా టెలీ క్యాంపెయిన్ నిర్వహిస్తూ వస్తున్నారు. నేరుగా ఓటర్ల నెంబర్‌లకు ఫోన్ చేస్తూ రికార్డు చేసిన సందేశాలను వినిపిస్తున్నారు.

కాగా ప్రచారం చివరి దశకు చేరుకున్న సమయంలో పలువురు అభ్యర్థులు ఏఐ సాయంతో ఓటర్లకు చేరువ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. నేరుగా సదరు ఓటరు పేరుతో పలకరిస్తూ తనకు ఓటు వేయాలని కోరుకుంటూ ఆర్టిఫిషియల్ ఇంటిలీజెన్స్‌తో రూపొందించి వీడియో క్లిప్పింగ్‌ను ఓటరు వాట్సప్‌నెంబర్‌కు పంపతున్నారు. తన పేరుతో పలకరించి వీడియో సందేశం పంపాడని ఓటర్లు భావిస్తే పప్పులో కాలేసినట్టే. ఆటోమెటిక్‌గా జనరేట్ చేసిన వీడియోలను పంపుతూ కొత్త పంథా అనుసరిస్తూ ప్రచారం నిర్వహిస్తుండటం గమనార్హం. మున్ముందు ఎన్నికల్లో టెక్నాలజీని మరింత ఉపయోగించి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలు ఎలాంటి ఉపాయాలు చేస్తాయో వేచి చూడాల్సిందే.

టెలీక్యాంపెయిన్‌తో ఓటర్లకు ఇక్కట్లు

కొత్త సాంకేతికతో ప్రచారం సులువు అవుతున్నా.. ఓటర్లకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యంగా టెలీ క్యాంపెయిన్‌తో ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యమైన పనుల మీద ఉన్న సమయాల్లో ఫోన్‌లు వస్తుండటంతో లిఫ్ట్ చేయగా.. రికార్డు చేసిన సందేశాలు వినిపిస్తున్నాయి. గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్ వస్తే లిఫ్టు చేయకుండా వదిలేద్దామంటే తెలిసిన వారెవరైనా చేసి ఉంటారేమోనన్న సందేహంతో ఫోన్ లిఫ్టు చేస్తుండగా తీరా వాయిస్ మెసెజ్ వినిపిస్తుండటంతో ఓటర్లు చిరాకు పడుతున్నారు. ఎన్నికల సంఘం ఇలాంటి వాటిని కట్టడి చేసి ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రచారం చేయించుకునేలా పార్టీలకు, అభ్యర్థులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేయాలని ఓటర్లు కోరుతున్నారు.

పట్టణంలో కోక దగ్ధం

- మూడు లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని మల్లారెడ్డి చెరువు సమీపంలో గల దక్షిణామూర్తి అనే వ్యక్తికి చెందిన కోకకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటి సామాన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు మూడు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

మున్సిపల్ వాహనాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-బోధన్



వాహనాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బోధన్ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకోసం కొనుగోలు చేసి ఉన్న వాహనాలను బుధవారం బోధన్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. పారిశుధ్య వాహనాల వివరాలు, రోజువారి పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాహనాల పనితీరు, వాటి కండిషన్ కు సంబంధించిన నివేదికను గురువారం తనకు సమర్పించాలని ఆయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వారివెంట కమీషనర్ వెంకటనారాయణ ఉన్నారు.

టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా తాజుద్దీన్ నియామకం

నవతెలంగాణ-మాక్లూర్



రాజ్యసభ సభ్యులు సురేష్‌రెడ్డితో తాజుద్దీన్

నిజామాబాద్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా తాజుద్దీన్ ను నియమిస్తూ భారత సంచార్ నిగం లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జూలై వరకు తాజుద్దీన్ పదవి కాలం కొనసాగనుంది. తాజుద్దీన్ ప్రస్తుతం మాక్లూర్ మండలం మైనార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తు న్నారు. తన నియామ కానికి సహకరించిన రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డికి తాజుద్దీన్ కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- 61 ఉపాధ్యాయ, 1021 పట్టభద్రుల ఓట్లు



సామగ్రితో వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసిల్దార్ ఆంజనేయులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రం 97 లో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం, పోలింగ్ కేంద్రం 151లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో 61 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా అందులో 50 మంది పురుషులు, 11మంది మహిళ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 1021మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా అందులో 691మంది పురుషులు, 330మంది మహిళ ఓటర్లు ఉన్నట్లు ఈ సందర్భంగా ఆయన వివరించారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. సాయంత్రం 4 గంటల లోపు పోలింగ్ కేంద్రం గేటులోకి ప్రవేశించిన వారు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సిబ్బంది పోలీస్ బందోబస్తు మధ్య సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలను కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

బ్యాలెట్ బాక్స్‌లతో జడ్పీహెచ్ఎస్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది



బ్యాలెట్ బాక్సులకు పాఠశాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు బుధవారం పోలీస్ బందోబస్తుతో పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో చేరుకున్నారు. పోలింగ్ ఆఫీసర్ ప్రమోద్ మాట్లాడుతూ..మండల వ్యాప్తంగా 304 మంది పట్టభద్రులు, 17 మంది ప్రభుత్వ టీచర్లు ఓటు హక్కు వినియోగించుకొనున్నారని తెలిపారు. ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎలక్షన్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడండి

- మండల పరిషత్ అధికారి మన్మోహన్ శాస్త్రి

నవతెలంగాణ-నిజామాబాద్



ఇంటి పన్నుతో పాటు కుళాయి పన్నును సకాలంలో చెల్లించి గ్రామ పంచాయతీ అభి వృద్ధికి తోడ్పడాలని ఎడపల్లి మండల పరిషత్ అధికారి మన్మోహన్ శాస్త్రి, పంచా యతీ కార్యదర్శి, మండల యూనియన్ అధ్యక్షులు ఉదయభాస్కర్ గ్రామస్తులను కోరారు. బుధవారం మండలంలోని తానాకాలన్ గ్రామంలో జిల్లా సంబంధిత ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఇంటి పన్ను, కులాయి పన్ను వసులకై గ్రామపంచాయతీ కార్యదర్శులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటి, కులాయి పన్నులను ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీకి చెల్లిస్తే గ్రామపంచాయతీ ద్వారా గ్రామాభివృద్ధికి కావలసిన వసతులు, మౌళిక సౌకర్యాలు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శుల యూనియన్, మండల అధ్యక్షులు ఉదయభాస్కర్, గ్రామపంచాయతీ కార్యదర్శులు రామీరెడ్డి, సాయికుమార్, రంజిత్, రాజేందర్, అమ్రిన్ బేగం, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ కప్స్‌లో టీ తాగుతున్నారా..? జరభద్రం

- పేపర్ కప్పుల్లో చాయ్.. యమ డేంజర్ !
- ఆరోగ్యానికి హానికరం
- వాటిని స్వతహాగ బ్యాన్ చేయండి
- ఒక్కసారి తాగితే ఏమైతదన్న నిర్లక్ష్యం వద్దు
- మైక్రోప్లాస్టిక్‌తో ముప్పు తప్పదు
- జాగ్రత్త తీసుకోకుంటే క్యాన్సర్‌ను కొని తెచ్చుకున్నట్లే అంటున్న వైద్యులు



నవతెలంగాణ-కంఠేశ్వర్

చాలా మందికి పేపర్ కప్‌లో టీ, కాఫీ తాగే అలవాటు ఉంటుంది. టీ, కాఫీ లేకపోతే రోజు గడవని వారు ఎంతో మంది ఉంటారు. రోజుకు నాలుగు నుంచి ఐదు టీ, కాఫీలు కూడా తాగే వారు ఉంటారు. అయితే ఇటీవల పేపర్ కప్స్ ట్రెండ్ బాగా పెరిగింది. ఈ పేపర్ కప్స్ వాడుతున్నారు. హెూటళ్ల యజమానులు గాజుగ్లాసులను శుభ్రం చేయకపోవడం కారణమైతే కరోనా తర్వాత ఈ జాగ్రతలు మరింత పెరిగాయి. దీంతో ఎప్పుడూ టీ తాగినా పేపర్ కప్ లోనే టీ పోయమని ప్రతి ఒక్కరూ అడుగుతున్నారు. కానీ పేపర్ కప్పులలో టీ తాగడం డేంజర్ అని వైద్యులు చెబుతున్నారు. బయట టీ కొట్టుల్లో మాత్రమే కాకుండా ఇళ్లలో కూడా చిన్న చిన్న శుభకార్యాలకు పేపర్ టీ కప్పులు ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు ప్లాస్టిక్ కప్స్ స్థానంలో ఇప్పుడు పేపర్ కప్స్ ఉపయోగం రోజురోజుకు పెరిగింది. పేపర్ డస్ట్ టీ, కాఫీ తాగడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని చాలా మంది భావిస్తుంటారు. అయితే వాస్తవం మాత్రం దానికి విరుద్ధమని నిపుణులు చెబుతున్నారు. డిస్పోజబుల్ కప్పుల్లో టీ లేదా కాఫీ తాగడం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదని అంటున్నారు. ఒక్కసారి తాగితే ఏమైతది అన్న నిర్లక్ష్యం వద్దు అని దీనివల్ల ఆరోగ్యంపై చాలా ప్రతికూల ప్రభావం పడుతుందని, అనేక రోగాలు వస్తాయని సూచిస్తున్నారు.

డిస్పోజబుల్ కప్పుల్లో

టీ లేదా కాఫీ తాగడం అంటే స్లో పాయిజన్ తాగినట్లే అని హెచ్చరిస్తున్నారు. ఇంతకీ ఈ గ్లాసుల్లో టీ, కాఫీ తాగడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. పేపర్ కప్పులో టీ, కాఫీ పోస్తే కాగితం తడవకుండా ఉంచేందుకు కాగితం కప్పులో సన్నని ఒక పొరను వేస్తారు. అయితే ఆ సన్నని పొర ప్లాస్టిక్‌తో తయారు చేస్తారు. దీనినే మైక్రోప్లాస్టిక్స్ అంటారు. ఈ మైక్రోప్లాస్టిక్స్ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. వేడి వేడి టీ లేదా కాఫీ పోసినప్పుడు మైక్రోప్లాస్టిక్ నుంచి చిన్న కణాలు బయలకు వస్తాయి. ఇది టీ, కాఫీలో కలిసి పోతుంది. అలాంటి టీని తీసుకుంటే నేరుగా కడుపులోకి వెళ్తుంది. ఇది క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం చాలా ఉంటుందని నిపుణులు అంటున్నారు. పేపర్ కప్పులో ఉండే మైక్రోప్లాస్టిక్ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఒక అధ్యయనం ప్రకారం, ఒక పేపర్ కప్పులో సుమారుగా 20వేల నుంచి 25వేల మైక్రోప్లాస్టిక్ కణాలు ఉంటాయి. ఇది మీ శరీరంలో హార్మోన్స్ ఇన్‌బాలెన్సుకు కారణమవుతుంది. అదే సమయంలో ఇది క్యాన్సర్, కడుపులో అల్సర్, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి అనేక ప్రాణాంతక వ్యాధులకు కూడా తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. పేపర్ కప్ మాటున దాగి ఉన్న మైక్రోప్లాస్టిక్స్ గురించి తెలియక చాలామంది. పేపర్ కప్స్ లో టీ, కాఫీ తాగుతున్నారనే చేరు నిజాన్ని ఈ అధ్యయనం బయట పెట్టింది. బయట హెూటల్స్, ఫుట్ పాత్‌పై పెట్టే టీ బండ్ల పైనా చాలా ఉపయోగిస్తున్నారు. వాటిని బ్యాన్ చేయాలని నిపుణులు చెపుతున్నారు.

ఏం జరుగుతుందో తెలుసా.....

పేపర్ కప్పుల్లో టీ తాగడం రోజుకు మూడుసార్లు 100 మిల్లీమీటర్ల చొప్పున వేడివేడి టీ తాగితే 70 వేల హానికరమైన మైక్రో ప్లాస్టిక్ కణాలు శరీరంలోకి ప్రవేశిస్తాయని వెల్లడించారు. ఈ విధంగా శరీరంలో ప్లాస్టిక్ చేరి భయంకరమైన రోగాలకు దారితీస్తుందన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ మిక్స్ అయ్యే కప్పులలో టీ తాగడం వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. బీపీ కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. పేపర్ కప్పులలో టీ తాగితే రోగాలను కొని తెచ్చుకున్నట్లే అని వైద్యులు చెబుతున్నారు

మితిమీరిన ప్లాస్టిక్ వాడడం రోగాలకు కారకం..

నిజామాబాద్ కన్సల్టెంట్ ఆకాలజిస్ట్ క్యాన్సర్ నిపుణులు
క్యాన్సర్ కేర్ హాస్పిటల్ వైద్యులు-చైతన్య కుమార్



మితిమీరిన ప్లాస్టిక్ వాడడం రోగాలకు కారకంగా మారుతుంది. దీనివల్ల క్యాన్సర్ రిస్క్ బాగా పెరుగుతుంది. ఎప్పుడైతే మనం ఈ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కంటైనర్స్‌లో వేడివేడి పదార్థాలు పార్సెల్ కి తీసుకుంటామో ఆ ప్లాస్టిక్ మైక్రో పదార్థాల మైక్రో ప్లాస్టిక్స్ మన ఫుడ్‌లోకి చేరి మన బాడీలోకి ఎంటర్ అవుతుంది. ఆ మైక్రోప్లాస్టిక్ బాడీలోకి ఎంటర్ అయిన తర్వాత డిఎన్ఏ డామేజ్ చేస్తుంది. డిఎన్ఏ డ్యామేజ్ అయిన కణాలు బాడీ కంట్రోల్‌లో ఉండవు అవి క్యాన్సర్స్ కణాలుగా మారిపోయి. విపరీతమైన వేగంతో మల్టీప్లై అవ్వడం వల్ల గడ్డలాగా ఫామ్ అవుతుంది. అదే క్యాన్సర్ అన్నమాట అది కాకుండా కొన్ని రకాల ప్లాస్టిక్ బిపిఎ, బీఎఫ్ఏ మన హ్యూమన్ హార్మోన్‌ని లిమిట్ చేస్తాయి. పెద్ద పేగు లోపల ఉండే మ్యూకస్ లేయర్ డ్యామేజ్ అవుతుందని తెలుస్తుంది. మైక్రో ప్లాస్టిక్ పేపర్స్ వల్ల లంగ్ క్యాన్సర్, లివర్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సరు, పెద్ద పేగు క్యాన్సర్ రిస్కు పెరుగుతూ వస్తుంది. అతి చిన్న వయసులోనే క్యాన్సర్ వస్తుంది. కానీ నాకు ఎలాంటి చెడు అలవాట్లు లేవు కానీ ఎలా వస్తుంది ఎందుకు వస్తుంది అని అంటున్నారు. కానీ మన జీవన శైలి వల్లనే ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయి. మన జీవన శైలిని ఎంత చక్కగా మార్చుకుంటే అంత బాగుంటుంది. ఈ మధ్యకాలంలో తల్లి రొమ్ము పాలలో కూడా మైక్రో ప్లాస్టిక్ క్యాన్సర్ కణాలు కనబడుతున్నాయి. దీనికి ఒకటే సొల్యూషన్ ఏంటంటే కవర్లలో వేడివేడి పదార్థాలు తీసుకోవద్దు. కవర్లలో వేడి వేడి చాయ్, టిఫిన్ తీసుకెళుంటారు. చాలామంది మేం పేపర్ ప్లేట్లు వాడుతున్నాం కాకపోతే మనం. సరిగ్గా అబ్జర్వ్ చేస్తే పేపర్ ప్లేట్ పైన కూడా ఒక ప్లాస్టిక్ పొర ఉంటుంది. అది కూడా హానికరమే. కొత్తగా వచ్చిన ప్లేట్స్ అందులో పైన విస్తరాకు కోటింగ్‌తో వస్తుంది అలాంటి ప్లేట్ వాడుకోవడం బెటర్. ఇంకా వీలైనంతవరకు మనం బయట టిఫిన్ పార్సెల్ తీసుకోవడానికి వెళ్ళినప్పుడు టిఫిన్ బాక్స్ తీసుకుపోవడం బెటర్. అంటే వాళ్ళు ఇచ్చే సాంబార్ గాని మన డబ్బాల్లోనే పార్సెల్ తీసుకోవడం వల్ల ఇబ్బందులు ఉండవు. ఇంకా బయట టీ తాగేటప్పుడు డిస్పోజబుల్ పేపర్ గ్లాసుల్లో తాగడం కంటే కాంచు గ్లాసుల్లో తాగడం, లేకపోతే మన సొంతవి క్లాసులు తీసుకొని అంటే దూర ప్రయాణాలు చేసేటప్పుడు మన గ్లాసులు పట్టుకొని వెళ్లి తాగడం ఉత్తమం. ఆ సింగిల్ యూస్ ప్లాస్టిక్ అంటే పేపర్ కప్పుల్లో కూడా లోపల వైపు చిన్న ప్లాస్టిక్ పొర(వ్యాక్స్) కూడా ఉంటుంది. మనం వేడి వేడి టీ పోసి ఇచ్చినప్పుడు అది కరిగి అది కూడా మన శరీరంలో పోతుంది. అన్ని జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్లు నివారించుకోవచ్చు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపుల దందా

- గ్రామాల్లో బెల్ట్ షాప్‌ల ద్వారా యథేచ్చగా మద్యం విక్రయాలు.
- ఎన్నికల కోడ్ ఉన్నా బెల్ట్ షాపుల దందా..

నవతెలంగాణ-బోధన్



బోధన్ ఉమ్మడి మండలంలో బెల్ట్ షాపుల దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. గ్రామాల్లో కొంతమంది రహస్యంగా మరి కొంతమంది కిరణ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నారు. అంతేకాకుండా అక్కడే సిట్టింగ్లు ఏర్పాటు చేసి రహస్యంగా మద్యం అమ్మవుతున్నారు. అయినా కూడా సంబంధిత శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నాగన్ పల్లి ,సాలూర, సాలంపాడ్, పెంటాఖుర్దు, ఊట్పల్లి, అమ్దాపూర్ గ్రామాలలో బెల్ట్ షాపులలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేస్తున్నారు.

వైన్స్ లు మూసేసినా..

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కమిషన్ ఎన్నికల కోడ్ ప్రకటించింది. అయితే గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దాంతో మంగళవారమే ఎక్సైజ్ శాఖ అధికారులు వైన్స్ లను మూసివేయాలని కోరుతూ ఆయా దుకాణాలను సీజ్ చేశారు. అయినా కూడా ఆపాటికే బెల్ట్ షాపులకు తరలిన మద్యం గ్రామాలలో విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. మద్య ప్రియులు అధిక రేట్లు చెల్లించి మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. పలు గ్రామాలలో ప్రధాన రహదారి వెంటనే ఉన్న కిరాణా షాపులలో, టీ దుకాణాలలో రహస్యంగా మద్యం విక్రస్తున్నారు. మంగళవారం రాత్రి బోధన్ రూరల్ పోలీసులు అమ్దాపూర్, ఊట్పల్లి గ్రామాలలో బెల్ట్ షాపులపై దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం బెల్ట్ షాప్ లను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే రహదారుల పక్కన చెట్ల కల్లు పేరుతో కల్తీకల్లు జోరుగా విక్రయిస్తున్నారు.నర్సిరోడ్ బైపాస్ సమీపంలో, నాగన్ పల్లి,సాలూర క్యాంప్ సమీపంలో, సాలూర నిండు చెరువు వద్ద కొంతమంది అనుమతి లేకుండా షెడ్లు ఏర్పాటుచేసి కల్లువిక్రయాలు జరుపుతున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.కావున అధికారులు ఇప్పటికైన స్పందించి అనుమతిని కల్లు దుకాణాలపై, బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

స్టార్ ఫ్రూట్.. పోషకాలు పుష్కలం

- ఇవేం పండ్లు అని అడిగి మరి కొనుగోలు
- విటమిన్లు అధికం

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎక్కడో తెలియని ప్రాంతాల్లో లభ్యమయ్యే స్టార్ ఫ్రూట్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో లభ్యమైంది. ఆ పండ్లను స్థానిక ప్రజలు చూసి ఇవేం పండ్లు అని అడిగి తెలుసుకొని మరి కొనుగోలు చేస్తున్నారు. నగరంలోని ఖలీల్ వాడి ప్రాంతంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఈ పండ్లను చూసి అక్కడి నుండి వెళ్లే ప్రజలు ఇవేం పండ్లని అడుగుతూ మరి తెలుసుకొని కొనుగోలు చేశారు. ఆ పండు పేరు స్టార్ ఫ్రూట్ అని తెలియచయడంతో కొనుగోలు చేశారు. అసలు స్టార్ ఫ్రూట్ అంటే ఏమిటి అని అడగగా అక్కడున్న వారితోపాటు అమ్మే మహిళ సైతం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పండ్లలో స్టార్ ఫ్రూట్ ఒక ప్రత్యకమైన ఆకారంను కలిగి ఉంటుంది. నక్షత ఆకారంలో కనిపించే ఈ పండు జ్యూసీ జ్యూసీగా ఉండడమే కాదు.. బాగా పండిన పండ్లు పసుపురంగులోకి మారి తియ్యగా ఉంటాయి. పచ్చి పండ్లు పుల్లగా ఉంటాయి. ఈ స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ ఎ, బి, సి పుష్కలంగా ఉంటాయి. స్టార్ ఫ్రూట్ చాలా మంది తినే ఉంటారు. వీటిలో పండిన పండ్లు పసుపురంగులోకి మారి తియ్యగా ఉంటాయి. పచ్చి పండ్లు పచ్చ రంగులో పుల్లగా ఉంటాయి. ఈ కాయల ఆకృతిని బట్టి వీటిని స్టార్ ఫ్రూట్ అని పిలుస్తారు. కానీ ఈ పండ్లను కారంబోలా అంటారు. వీటిని ఎక్కువగా ఉష్ణమండల దేశాలలో ఎక్కువగా పండిస్తారు. ఆగ్నేయాసియా, దక్షిణ పసిఫిక్, తూర్పు ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా పండిస్తున్నారు. ఈ పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. స్టార్ ఫ్రూట్లో విటమిన్ సి, బి2, బి6, బి9 విటమిన్లు, ఫైబర్, పొటాషియం, జింక్, ఐరన్, కాల్షియం, సోడియం, ఫోలేట్, కాపర్, మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాల మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

బెస్ట్ లీడర్‌కు సన్మానం



బెస్ట్ లీడర్‌ను సన్మానిస్తున్న వైస్‌ఛాన్సలర్

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ పడిగెల సుదర్శన్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్‌లో డాక్టర్ వైఎన్ కళాశాలలో ఏడు రోజుల జాతీయ సమైక్య శిబిరంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంటిజెంటిల్ లీడర్‌గా పడిగల సుదర్శన్ పర్యవేక్షణలో చక్కటి ప్రతిభ కనబరిచినందుకు మంగళవారం తెలంగాణ యూనివర్సిటీలో ఉన్న వైస్‌ఛాన్సెలర్ యాదగిరిరావు, తెలంగాణ యూనివర్సిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో బెస్ట్ లీడర్‌కు సర్టిఫికెట్, షీల్డ్, పూలమాలవేసి శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డాక్టర్. ప్రిన్సిపాల్ సతీష్, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, అకాడమీ కోఆర్డినేటర్ బీ.శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

- గ్రామస్తులకు సూచించిన ఎస్ఐ బి.నరేష్



మాట్లాడుతున్న ఎస్ఐ బి. నరేష్

నవతెలంగాణ - బాల్కొండ

నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ సిహెచ్ సింధు శర్మ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కళాబృందం వారి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని బోదేపల్లి గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్కొండ ఎస్ఐ బి. నరేష్ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాల వల్ల గ్రామం సురక్షితంగా ఉంటుందని సూచించారు .ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలనీ, మైనర్ విద్యార్థులు వాహనాలు నడపరాదని సూచించారు. విద్యార్థినుల భద్రత కోసం రక్షణగా నిజామాబాద్ షీ టీమ్ రక్షణ కల్పిస్తుందనీ తెలిపారు.మహిళలు అత్యవసర పరిస్థితుల్లో నిజామాబాద్ షీ టీమ్ నంబర్ 8712659795 ,డయల్ 100 కి ఫోన్ చేయాలని అన్నారు. మీ మొబైల్ ఫోన్ దొంగిలించిన, పోగొట్టుకున్న సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరి చేయడం జరుగుతుందనీ తెలిపారు.ఆన్లైన్, సైబర్ మోసాలు గురించి అప్రమత్తంగా ఉండాలని వివరించారు,దీనికి సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేయాలని తెలిపారు. కళాబృందం వారు విద్యార్థులకు చక్కని నాటిక, పాటల రూపంలో సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పిస్తూ జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు హెచ్చరించారు. కార్యక్రమంలో బాల్కొండ ఎస్ఐ బి.నరేష్, కళాబృందం సిబ్బంది విక్రమ్, శ్రీనివాస్, శేఖర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబరీశునికి 91 తులాల వెండి వితరణ



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని బొంపల్లి స్టేజి వద్ద గల అంబరీష్ ఆలయానికి 91 తులాల వెండిని వితరణ చేశారు. బుధవారం భాగ్య రాజిరెడ్డి కామారెడ్డి ఎస్ పి ఆర్ కాలనీకి చెందిన వారు 11 తులాల వెండిని బుధవారం వితరణ చేశారు. రాజశేఖర్ అనిల్ గుప్తా హైదరాబాద్ చెందినవారు 80 తులాల వెండిని వితరణ చేశారు. సరళా రెడ్డి రాజమౌళి డాక్టర్ అశోక్ సంజీవని ఆసుపత్రి ద్వారా 51 వేల రూపాయలు ఆలయ అభివృద్ధికి అందించినట్టు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంగెం రాజిరెడ్డి గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కుటుంబానికి సాయం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట అక్క, చెల్లెలు పురుగుల మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకొని బుధవారం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ రూ 5000, జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి రూ 5000, మాజీ ఎంపీటీసీ చందర్ నాయక్, మాజీ సర్పంచ్ రెడ్డి నాయక్, బోజు నాయక్, తిరుపతి నాయక్ కలిసి రూ 12,000 ఆర్థిక సహాయాన్ని మోహన్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో రాజు నాయక్, సరియా, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిని చంపిన కేసులో

రాజీ కావట్లేదని తల్లిహత్య

నవతెలంగాణ-పిట్లం



సాబేర బేగం (ఫైల్)

తమ్ముడి చంపిన కేసులో కోర్టులో ట్రయల్ కొనసాగుతుండగా.. రాజీకావట్లేదని కన్నతల్లిని రోకలిదుడ్డుతో కొట్టి చంపాడో కొడుకు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన సాబేర బేగం (60) కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. 2021న ఆమె రెండవ కుమారుడైన షాదుల్ ఆస్తి తగాదాలతో మూడవ కుమారుడైన ముజీబ్‌ను అతి దారుణంగా కత్తితో పొడిచి చంపాడు. మర్డర్ కేసు నమోదు కాగా ప్రస్తుతం కోర్టులో ట్రయల్ కొనసాగుతోంది. నిందితుడైన షాదుల్ వాళ్ల అమ్మను మర్డర్ కేసులో రాజీ కావాలని కోరగా.. అందుకు సాబేర బేగం ఒప్పుకోకపోవడంతో షాదుల్ ఆమెతో గొడవపడి మంగళవారం ఉదయం అందాజా ఏడున్నర గంటల సమయంలో షాదుల్ కన్నతల్లి సాబేర బేగం తలపై రోకలి దుడ్డుతో కొట్టగా తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది. మృతురాలి పెద్ద కుమారుడు అబ్దుల్ ఖాదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

నవతెలంగాణ-తాడ్వాయి



మృతి చెందిన సావిత్రి

కుటుంబ కలహాలతో పత్తిమందు సేవించి ఆత్మహత్యకు యత్నించిన వివాహిత చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది. ఈ ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన హనుమంతుల్లా సావిత్రి (40) కుటుంబ కలహాలతో ఈనెల 19 తేదీన రాత్రి పత్తి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు నితిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య

నవతెలంగాణ-లింగంపేట్

అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయని మనస్తాపంతో కుంటలో దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగంపేట్ మండలంలోని మోతె గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రావు వివరాల ప్రకారం.. మోతే గ్రామానికి చెందిన సంగవ్వ (55) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆసుపత్రిలో వైద్య చికిత్స చేయించిన తగ్గుముఖం పట్టడం లేదు. తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికారు. గ్రామ సమీపంలోని కుంటలో పడి ఉండడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భర్త భూమయ్య పిర్యాదు మేరకు శవాన్ని పంచాంగం నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

రామారెడ్డి : నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున, మండల కేంద్రంలో పోలింగ్ బూత్ నెంబర్ 181కి బుధవారం పోలింగ్ కేంద్ర సిబ్బంది సామాగ్రితో చేరుకున్నారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు.



ఎన్నికల సామాగ్రితో సిబ్బంది

మద్నూర్ : నేడు పట్టభద్రుల, ఎమ్మెల్సీ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల పోలింగ్ సామాగ్రిని సిబ్బందికి అందజేశారు. మద్నూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి మద్నూర్ తాసిల్దార్ ఎండి ముజీబ్ మద్నూర్ ఎంపీడీవో రాణి పోలింగ్ కేంద్రం ఏర్పాట్లను సామాగ్రిని పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతం గా జరగడానికి భద్రత ఏర్పాట్లు చేసినట్లు సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ ఎండి ముజీబ్, ఎంపీడీవో రాణి తెలిపారు.



పోలింగ్‌కు సర్వం సిద్ధం

సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

నవతెలంగాణ-పిట్లం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల పర్యవేక్షకులు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారము నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను పిఎస్ నంబర్ 112లో 49 మంది టీచర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా 167 బూత్‌లో 487 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకొనునట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు గాను ఒక పిఒ, ఇద్దరూ ఏపీవోలు, ఒక ఓపిఓలు, పోలీస్ బందోబస్తు మధ్యన ఎన్నికలు నిర్వహించనున్నట్లు పర్యవేక్షకులు వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమలాకర్, ఆర్ఐ శీతల్, తాసిల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ రహీముద్దీన్ తెలిపారు. పట్టభద్రులకు సంబంధించి 671 ఓట్లు ఉండగా 42 ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయని తెలిపారు. సిబ్బందికి ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, పోలింగ్ ప్రాంతంలో 144 సెక్షన్ విధించమని గురువారం ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటింగ్ జరగనుందని తహసిల్దార్ తెలిపారు.



పిట్లంలో...

పెద్దకొడప్ గల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పూర్తి ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ దశరథ్ తెలిపారు. గురువారం జరుగబోయే ఎన్నికల ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా లేదా అని సబ్ కలెక్టర్ కిరణ్మయి, రూట్ ఆఫీసర్ సల్మాన్ బుధవారం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్, ఆరై అంజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



తాడ్వాయిలో...

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. టిజియుఈఈయు, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ జిల్లా సూపరిండెంట్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు, ఆర్టిజన్ కార్మికుల, అన్మ్యాన్డ్ కార్మికుల సమస్యలపైన కామారెడ్డి విద్యుత్ సూపరిండెంట్ శ్రావణ్ కుమార్‌ను కలిసి విద్యుత్ ఉద్యోగుల సమస్యలపైన చర్చించడం జరిగిందన్నారు. అనంతరం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు సింగిరెడ్డి చంద్రారెడ్డిలు మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికుల డ్యూటీల విషయంలో పది డ్యూటీలు మాత్రమే వేయాలని, లేనియెడల మా యొక్క కార్మికులు 8 గంటలు డ్యూటీ చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నారని ఏస్ఈ శ్రావణ్ కుమార్‌కు వివరించారు. ఈ విషయంపై ఏస్ఈ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, లైన్ ఇన్‌స్పెక్టర్, కమిటీ సభ్యులు సునీల్, రవి, తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో..

శివనామస్మరణ

ఘనంగా శివరాత్రి వేడుకలు | భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నవతెలంగాణ-విలేకరులబృందం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. శివరాత్రి వేడుకలు పురస్కరించుకొని ఆలయాలు సందర్శకులతో కిటకిటలాడాయి.

లింగంపేట్ : మండలంలోని మోతే నల్లమడుగు శెట్టిపల్లి సంగారెడ్డి శివాలయం మంబోజి పేట రామాలయం అయ్యపల్లి గ్రామ సమీపంలోని శివాలయం పోల్కంపేట గ్రామంలోని హరిహర గోపాల స్వామి ఆలయం కొర్పల్ గ్రామ సమీపంలోని రాజరాజేశ్వరాలయం మేంగారం గ్రామంలోని శివాలయం లింగంపేట మండల కేంద్రంలోని నగర శివాలయం రామాలయం సాయిబాబా ఆలయం బాణాపూర్ గ్రామంలోని రామాలయం శెట్టిపల్లి గ్రామంలోని శ్రీ మల్లికార్జున ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళలో ఆలయాల వద్ద భజన కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

తాడ్వాయి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. రంగురంగుల బల్బులతో పలు రకాల పూలతో అలంకరించిన ఆలయాల్లో ఉదయం నుండి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు భక్తి పాటలతో భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం జాగారం చేశారు. సంతాయి పేట్ శివారులో గల భీమేశ్వరాలయం, చిట్యాల గ్రామ సమీపంలోని శివాలయం కృష్ణ జీవాడి గ్రామ సమీపంలో గల శివాలయాల్లో భక్తులు తమ కోరికలు నెరవేరాలంటూ ఉపవాస దీక్షలతో జాగారం చేపట్టారు. భక్తుల సౌకర్యం కోసం కమిటీలుఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి బస్ డిపో నుండి సంతాయి పేట్ ఆలయ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ధర్పల్లి మైపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

కల్యాణోత్సవ వేడుకలు..

దోమకొండ : మండల కేంద్రంలోని శివ రామ మందిరం ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, నాయకుల ఆధ్వర్యంలో గంగ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి కళ్యాణం మహోత్సవం వేడుకలు వేద మంత్రోచ్చారణలతో పలు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా బుధవారం నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి భక్తులు బారులు తీరి విశ్వేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండ అంజయ్య, మాజీ చైర్మన్ అబ్రబోయిన రాజేందర్ ,దర్మకర్తలు స్వాతి శేఖర్, మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్, నాయకులు అనంతరెడ్డి, నల్లపు శ్రీనివాస్, అబ్రబోయిన స్వామి, నర్సారెడ్డి, ఈవో ప్రభు, అర్చకులు, భక్తులు తదిత రులు పాల్గొన్నారు.



రామారెడ్డి : మద్దికుంటలో

సదాశివనగర్ : మండలంలోని శివాలయాలు భక్త లతో కిటకిటలా డాయి. ఉదయం నుండే భక్తులు ఆలయాలకు చేరు కొని ప్రత్యేక పూ జలు నిర్వహించి ఉపవాస దీక్షలు తీసు కున్నారు. రాత్రి వేళల్లో జాగరణలు చేశా రు. మండలంలోని బొంపల్లి స్టేజి వద్ద గల అంబరీష్ ని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్నూ ర్ గ్రామంలోని కండేరాయ ఆలయంలో పూజలు నిర్వహించారు. మల్లన్న గుట్టపై మల్లికార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్వరాల్ గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయంలో రాత్రి జాగరణలో భజనలు చేశారు. దగ్గి గ్రామంలోని ప్రభుదేవుని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తుల కోసం ఆలయ వద్ద తినిబండరాల దుకాణాలు ఏర్పాటు చేశారు.

జుక్కల్ : మండలంలోని పలు గ్రామాలలో మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలను ఒకరోజు ముందే విద్యుత్ దీపాలతో దీపాలంకరణ చేసి ముస్తాబు చేశారు. బుధవారం ఉపవాస దీక్షలు ఉండడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో శివాలయాలలో ఇతర మందిరాలలో అదుపు చేసేందుకు తంటాలు పడాల్సిన పరిస్థితి పలు గ్రామాలలో నెలకొంది.

[redacted]





దొమకొండలో...




జుక్కల్: పూజలు చేస్తున్న భక్తులు

108 జంటలతో సామూహిక రుద్రాభిషేకం

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని పాప హరేశ్వర ఆలయం మహశివరాత్రి వేడుకలను బుధవారం ఘనంగా గ్రామ కమిటీ అధ్వర్యంలో నిర్వహించారు. 108 జంటలతో సామూహిక రుద్రాభిషేకం, బిల్వాభిషేకం, పూజలు, అభిషేకలు,యజ్ఞ,హెూమం కార్యక్రమలు చేశారుభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం రోజున ఉదయం అన్నదాన కార్యక్రమంలో భక్తులు అందరు పాల్గోవాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.





లింగంపేట్: పూజలు చేస్తున్న భక్తులు



తాడ్వాయి: శివాలయంలో క్యూలో ఉన్నా భక్తులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్
గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com

కందకుర్తి గోదావరిలో గల్లంతైన యువకుడు మృతి



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరిలో గల్లంతైన యువకుడు మృతిచెందినట్టు ఎస్ఐ సాయన్న తెలిపారు. బోధన్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన వర్ధన్ (22) బుధవారం శివరాత్రి పండుగను పురస్కరించుకొని తన కుటుంబ సభ్యులతో గోదావరిలో స్నానాలకు వచ్చారు. స్నానం చేస్తుండగా గోదావరిలో గల్లంతయ్యాడు. గజఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ చంద్ర హైస్కూల్ వారు నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. పట్టణంలోని నటరాజ నృత్యానికేతన్ నాట్య గురువు డాక్టర్ బాసెట్టి మృణాళిని శిక్షణలో చిన్నారుల ప్రదర్శనలు, ముఖ్యంగా వెంకటేశ్వర స్వామి నాట్య ప్రదర్శన అబ్బురపరిచాయి.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు





ఆర్మూర్‌లో..

- శివాలయాలవద్ద బారులుతీరు భక్తులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ : పట్టణంలోని సిద్దుల గుట్ట, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పక్కనగల నాగలింగేశ్వర స్వామి ఆలయం, మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్ శివ పంచాయతన ఆలయం, మండలంలోని చేపూర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ గ్రామ దత్తాశ్రమంలోని పాదరసలింగం, మోతే, కుకునూర్, పచ్చల నడుకుడ గ్రామాల్లోని రాజరాజేశ్వర దేవాలయాలు, నందిపేట లోని కేదారేశ్వర తదితర ఆలయాల్లో ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. పట్టణంలోని సిద్దుల గుట్టకు వేల సంఖ్యలో భక్తులు తరలిరాగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో టెంట్లు, బారికేడ్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. నేడు భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. మండలంలోని చేపూర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి ఎంతో విశిష్టమైన చరిత్ర ఉందని, గ్రామ అభివృద్ధి కమిటీ గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నేడు జరిగే అన్నదాన కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వీడిసి అధ్యక్షులు శ్రీకాంత్ తెలిపారు.

రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం

మండలంలోని చేపూర్ గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ గ్రామ ప్రజల సహకారంతో యజ్ఞ హెూమాధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. స్వామివారికి జలాభిషేకం అభిషేకం నిర్వహించారు. నేడు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

సిద్ధుల గుట్టపై..

పట్టణంలోని ప్రసిద్ధమైన నవనాథ సిద్ధలగుట్ట పైన మహా శివరాత్రి సందర్భంగా పట్టణ, జిల్లాతో పాటు అనేక జిల్లాల నుండి తెలంగాణ చుట్టుపక్కల గ్రామాల నుండి దాదాపు ఒక లక్షకు పైగా భక్తులు విచ్చేశారు. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి శివాలయంలో అభిషేకాలు నిర్వహించి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యే కు పట్టు శాలువాతో పూలమాలతో ఎసన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవనాథ సిద్దేశ్వరుని దర్శించుకున్నారు.

బాల్కొండ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని శివాలయాలలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజామున శివాల యాలకు వెళ్లారు. ఈ సందర్భం గా ఆలయాలలో భక్తులు రుద్రాభిషేకం, రుద్రహెూమాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెంజల్ : రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలోని శ్రీ నాగరాజు లింగేశ్వర ఆలయంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ అబ్బగోని శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో నాగదేవతపడిగే, కలశాభిషేకం ప్రతిష్టాపన మహెూత్సవం జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ఉపవాస దీక్షలోనున్న భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల నుంచి విచ్చేసి పూజలు చేసిన భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి నరసయ్య గౌడ్, లచ్చే వార్ రఘునాథ్, బోర్గం మాజీ సర్పంచ్ సాయి రెడ్డి, గోపికృష్ణ, సాయినాథ్, రాజు గౌడ్, మీసాల గణేష్, నాగనాథ్, ఆలయ పూజారి మన్మథ స్వామి, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

బోధన్ : శివరాత్రి పండుగ సందర్భంగ శివాలయాల్లో శివరాత్రి పండుగ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ బోధన్ పట్టణంలో పురాతన ఏకచక్రేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఆలయ కార్యనిర్వాహణ అధికారి రాములు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు ఏర్పాటుచేసి దర్శనం సులువుగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలున్న భక్తుల కోసం పలువురు స్వచ్ఛదంగా పండ్లు పంపిణీ చేశారు. సాలూర సంగమేశ్వర ఆలయం, పెంటాఖుర్దులో దత్తాత్రేయ స్వామి ఆలయం సందడిగా మారింది. ఉదయం నుంచే శివాలయాలకు భక్తులు తరలిరావడంతో అంతటా శివాలయాలు కోలాహలంగా మారాయి. బోధన్ శివాలయంలో ప్రముఖులు, అధికారులు దైవదర్శనం చేసుకున్నారు.

> **మహాశివరాత్రి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. శంభో శంకర హర హర మహాదేవ... ఓం నమ:శివాయ అంటూ భక్తుల నామస్మరణలు, వేద పండితుల మంత్రోచ్చరణతో శివాలయాలు మార్మోగాయి. ఉదయంనుండే దేవాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. శివలింగానికి పంచామృత అభిషేకాలను, అర్చనలను నిర్వహించారు. జాతరలు కొనసాగాయి. ఈ సందర్భంగా స్థానిక గ్రామ అభివృద్ధి, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు.**

పోలీసుల బందోబస్తు...

బోధన్ పట్టణంలో భక్తుల రద్దీ కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకటనారాయణ పలుచోట్ల పోలీసుల బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రధాన రహదారి వద్ద బారికేడ్లు ఏర్పాటుచేసి ఆలయం వరకు వాహనాలు వెళ్లకుండా నియంత్రించారు.

కమ్మర్‌పల్లి : దక్షిణ కాశీగా పేరుగాంచిన ఉప్లూర్ లోని శ్రీ బాల రాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాగరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులు బాల రాజేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం నుండే ఆలయం వద్ద పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు. ఇతర ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. గతంలో కోరుకున్న మొక్కులు తీరిన పలువురు భక్తులు కోడెల సమర్పించుకున్నారు. పుట్టు వెంట్రుకలు, బెల్లం తో తులాభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉపవాస దీక్షలతో అర్ధరాత్రి స్వామి వారికి జరిగిన మహా రుద్రాభిషేకంలో, స్వామివారి శావా ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు ఆలయంలోనే శివరాత్రి జాగరణ చేశారు. గురువారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్న వితరణ కార్యక్రమంలో ఉపవాస దీక్షలను విరమించి స్వస్థలాలకు వెళ్తారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకొని బాల రాజేశ్వర స్వామి ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మహాశివరాత్రి సందర్భంగా సుమారు 70 వేలకు పైగా మంది భక్తులు జాతర ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సోమ దశరథం తెలిపారు.ఉప్లూర్ శ్రీ బాల రాజేశ్వర స్వామిని కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా వందల సంఖ్యలో వెలసిన దుకాణాల్లో భక్తుల కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో చిన్నారులు స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. మండలంలోని చౌట్ పల్లి శ్రీ పార్థివ కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గొల్లపేట శివాలయంలో, శ్రీగిరి క్షేత్రం పైనున్న శివాలయంలో, అమీర్ నగర్‌లోని శివగుట్ట ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కమ్మర్‌పల్లి, అమీర్ నగర్ గ్రామాల్లోని శివాలయాల్లో గురువారం ఉదయం అన్న వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న వితరణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మాక్లూర్ : మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా రెండు రోజుల పాటు జాతరను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. మొదటి రోజు బుదవారం యజ్ఞం చేపట్టారు. రెండవ రోజు అన్నదానం, జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. గ్రామంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న మందిరంలో శివ లింగానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యాదవ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

పోతంగల్ : మండలంలో అన్నిగ్రామాల్లో శివరాత్రి సందర్భంగా శివాలయాల్లో ఉదయంనుండే భక్తజనం క్యూ కట్టారు. మండల కేంద్రంలోని ప్రాచీన కాశివిశ్వనాథ మందిరంలో ప్రదీప్ మహారాజ్ మాట్లాడుతూ.. రాత్రి జాగారం, శివాభిషేకం, శివపురాణం, భజన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు.

వర్ని : చందూర్ మండల కేంద్రంలోని అల్లమా ప్రభు శివాలయంలో శివరాత్రి ఉత్సవాలను మండల ప్రజలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం శివ పార్వతుల కల్యాణ మహెూత్సవం నిర్వహించి శివ పార్వతులను పల్లకిలో ఊరేగించారు.

నిజామాబాద్ సిటీ : మహాశివరాత్రి సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పలు శివాలయాలను దర్శించుకున్నారు. నిజామాబాద్ నగర శివారులోని మల్లారం ప్రాంతంలో గల శ్రీ లింగేశ్వర ఆశ్రమం శివాలయాన్ని దర్శించుకున్నారు, అనంతరం నగరంలోని శంభుని గుడిని, ఆ తర్వాత నగరేశ్వర ఆలయాన్ని అర్బన్ ఎమ్మెల్యే దర్శించుకుని నగర ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని చౌట్‌పల్లిలో మహా శివరాత్రి సందర్భంగా కోటిలింగేశ్వర స్వామిని రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్‌రెడ్డిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు గంగాప్రసాద్ దీక్షితులు ఎంపీ సురేష్ రెడ్డిని పూలమాల, శాలువాతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. అనంతరం సురేష్ రెడ్డి గ్రామంలోని లక్ష్మీనారాయణ స్వామి మందిరాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.



ఆర్మూర్: సిద్దుల గుట్టపైన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



ఆర్మూర్ : చేపూర్‌లో..



బోధన్: పూజలు చేస్తున్న భక్తులు



కమ్మర్‌పల్లి: క్యూలో ఉన్న భక్తులు

బూత్ సెంటర్ల పరిశీలన



బూత్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

నవతెలంగాణ-వర్ని

పట్టా భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండలంలోని వడ్డేపల్లి ప్రభుత్వ పాఠశాలలో రెండు బూత్‌లు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ రాజేశ్వర్, తహసీల్దార్ సాయిలు తెలిపారు. పట్టభద్రుల ఓటర్లకు వసతులు కలిపించడంలో లోపం జరుగకుండా సెంటర్లను బుధవారం పరిశీలించారు. పట్టా భద్రులు తమ ఓటు హక్కును వినియోగించు కొనుటకు మహిళలకు, పురుషులకు రెండుబూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల ఓటర్లకు తాగు నీరు, నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సాబుదానా ప్రసాదం పంపిణీ



ప్రసాదంను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నగర ప్రజలకు రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ తరపున అధ్యక్షులు బిరెల్లి విజయరావు శుభాకాంక్షలు గురువారం తెలిపారు. స్థానిక హైమది బజార్ నందుగల శంభునిగుడి ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం సాబుదానా ప్రసాదాన్ని అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గంగారెడ్డి, సుధీర్ గుప్తా, పవన్ పాండే, గోపాల్ సోని, జితేంద్ర మలాని, బాబురావు దంపతులు, పార్సి రాజేశ్వర్ దంపతులు, రామకృష్ణ, ఆకుల అశోక్, జుగల్ సోనీ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మాధవి విద్యానికేతన్‌లో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ మాధవి విద్యనికేతన్ పాఠశాల 25వ సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మల్లెపూల సురేష్‌గౌడ్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నాణ్యమైన విద్య బోధన చేయడంతో మండలంలోని ఆయా గ్రామాల పిల్లలను పాఠశాలల్లో చేర్పించారని, పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించారని, పలుమార్లు మండల స్థాయి ర్యాంకును సైతం పొందారని తెలిపారు. ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రైవేట్ సంస్థ విద్యాలయాల్లో ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, మరికొందరు చిరు వ్యాపార రంగంలో రాణిస్తున్నారని చెప్పారు. మాధవి పాఠశాల కరస్పాండెంట్ మల్లెపూల సురేష్ గౌడ్ , ఆయన సతీమణి మాధవి ఉపాధ్యాయులుగా పనిచేస్తూ భర్తకు చేదుడువాదోడుగా నిలుస్తున్నారన్నారు. విఆర్‌ఆర్ గార్డెన్‌లో పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు కరస్పాండెంట్ సురేష్ గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో బాల బాలికలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మల్లెపూల సురేష్‌గౌడ్ దంపతులను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ విద్యావేత్తలు, యువకులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు వారిని అభినందించి సన్మానించారు. శ్రీ మాధవి పాఠశాలలోని ఉపాధ్యాయులను, పాఠశాల కరస్పాండెంట్ ఘనంగా సన్మానించారు. పాఠశాలకు వచ్చే బాల బాలకల తల్లి తల్లిదండ్రుల ప్రోత్సాహం సహకారంతో మండల స్థాయి సంబంధిత అధికారుల మన్నలను పొంది సిల్వర్ జూబ్లీ తమ పాఠశాలలో జరుపుకోవడం తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందని కరస్పాండెంట్ మల్లెపూల సురేష్ గౌడ్ మాధవి హర్షం వ్యక్తం చేశారు.



శ్రీ మాధవి విద్యానికేతన్‌లో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలలో పాల్గొన్న కరస్పాండెంట్ దంపతులు, చిన్నారులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

బాల రాజేశ్వరుడికి
రూ.16 లక్షల నగలు అందజేత

- **అజ్ఞాత దంపతులు ఇచ్చినట్టు తెలిపిన ఆలయ కమిటీ**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ శ్రీ బాల రాజేశ్వర స్వామి ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా దంపతులైన అజ్ఞాత భక్తులు సుమారు 16 తులాల బంగారు నగలను విరాళంగా అందజేశారు. గతంలో తాము కోరుకున్న కోరికలు నెరవేరినట్లు పేర్కొన్న అజ్ఞాత దంపతులు తయారు చేయించి తెచ్చిన సుమారుగా రూ.16 లక్షల విలువైన 16 తులాల బంగారు నగలను ఆలయ అభివృద్ధి కమిటీకి విరాళంగా అందించారు. బాల రాజేశ్వరస్వామి ఆలయంలోని స్వయంభు లింగానికి బంగారు తాపడం (తొడుగు)తో పాటు బంగారు నాగేంద్రుని ప్రతిమను అందజేశారు. నగలను ఆలయ అభివృద్ధి కమిటీలకు దంపతులు అందజేయగా, మహాశివరాత్రి సందర్భంగా నగలను స్వయంభు లింగానికి అలంకరించారు.



కాగా బాల రాజేశ్వరుడికి ఇంతవరకు ఎంతోమంది భక్తులు తోచిన విధంగా నగదు కానుకల రూపంలో విరాళాలు అందించారని ఇంత పెద్ద మొత్తంలో విరాళ అందించడం ఇదే మొదటిసారి అని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక వ్యక్తి అదృశ్యమై మృతి చెందాడు. ఎస్ఎస్ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం..

కోటగల్లికి చెందిన గుమ్మడి శ్రీనివాస్ రెడ్డి (48) కార్ డ్రైవింగ్ చేసేవాడు. ఫిబ్రవరి 15న కారు డ్రైవింగ్‌పై నిజామాబాద్ నుండి కుంభమేళాకు వెళ్లి తిరిగి ఈనెల 17న రాత్రి సమయంలో నిజామాబాద్ వచ్చాడు. అయితే నిజామాబాద్‌కు వచ్చినప్పటి నుండి మరల వాళ్ళ ఇంటికి వెళ్లలేదు. ఆయన ఆచూకీ గురించి బంధువులు చుట్టుపక్కల బంధువుల ఇండల్లో వెతికిన సమాచారం తెలియలేదు. ఈ విషయంలో 24న దరఖాస్తు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా విచారిస్తుండగా మంగళవారం నవీపేట, గాంధీనగర్ గ్రామ శివారులో ఒక గుర్తు తెలియని శవం ఉన్నదని సమాచారం రావడంతో సంబంధిత సిబ్బంది అదృశ్య మైన శ్రీనివాస్ బంధువులకు మృతదేహాన్ని చూపించారు. అది శ్రీనివాస్ రెడ్డి మృతదేహంగా గుర్తించారు. నాలుగు ఐదు రోజుల నుంచి గాంధీనగర్ గ్రామంలో బట్టలు లేకుండా పిచ్చివాడిలా తిరుగుతూ కనిపించినట్టు గ్రామస్తుల ద్వారా తెలిసింది. అయితే ఆయనకు మద్యం, కల్లు తాగడం అదేవిధంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నట్టు ఇతని ఇబ్బందుల ద్వారా తెలిసింది. ఆయన భార్య లక్ష్మి దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెట్టిన గంటకే ఫ్లెక్సీ చించివేత

నవతెలంగాణ-ఆర్మూర్



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణం లోని సిద్దుల గుట్టకు వెళ్లె దారిలో ఈరవత్రి రాందాస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఫ్లెక్సీ పెట్టారు. గంట సమయంలోపే ఆ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చింపివేయడం కలవరం రేపింది. రాజకీయాలకు అతీతంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ సిపి రాజశేఖర్ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ చింపడం సిగ్గుచేటని పలువురు విద్యావేత్తలు బుధవారం తెలిపారు.

కుర్నాపల్లిలో జాతర ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా, ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామంలో ఉమామహేశ్వర స్వామి ఆలయంల, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, గ్రామ పెద్దల సమక్షంలో జాతర ఉత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారు. బుధవారం నుంచి మార్చి 3 వరకు జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహాశివరాత్రి ఆలయ ఆవరణంలో రథం ఊరేగింపు నిర్వహించారు. పెద్ద రథాన్ని మార్చి 2న ఉమామహేశ్వర ఆలయం నుంచి గ్రామ శివారు పొలిమేర వరకు ఊరేగిస్తారు. జాతర ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జాతర ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హెల్త్ క్యాంపులతో వల

- ఆస్పత్రి పబ్లిసిటీకోసం హెల్త్‌క్యాంప్‌లు
- రోగుల సంఖ్యను పెంచుకోవడానికి
- అనారోగ్యం అంటూ ఆస్పత్రికి రిఫర్
- రకరకాల టెస్టుల పేరుతో దోపిడి


నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అనారోగ్య సమస్యలు ఉన్నాయని గుర్తించడానికి ఉచిత హెల్త్ క్యాంపులు పెడుతున్నారని, ఏదైనా సమస్య ఉన్నట్టు గుర్తించి తమ ఆస్పత్రులకు రప్పించుకుంటున్నారని, ఇదంతా కొందరు వైద్యులు పేషెంట్లకోసం చేస్తున్న జిమ్మిక్కని ప్రజలు అంటున్నారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్యను పెంచుకోవడానికి పలు ఆసుపత్రుల యాజమాన్యాలు ఇలా చేస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఆసత్రికి వెళ్లాక రకరకాల టెస్టుల పేరుతో పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు బహిరంగంగానే అనుకుంటున్నారు.

నిజామాబాద్ జిల్లాలో పలు ఆస్పత్రుల వారు స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, ట్రస్టులకు ఉచితంగా హెల్త్ క్యాం నిర్వహిస్తామని చెబుతున్నారు. హెల్త్‌క్యాంప్‌లో ఉచితంగా రక్త పరీక్షలు, చిన్న పాటి టెస్టులు చేస్తున్నారు. మీకు ఈ సమస్య ఉందని, అది ఇక్కడ చూడటం కుదరదు.. ఆసుపత్రికి వస్తే తెలుస్తుందని డాక్టర్లు సలహాలు ఇస్తున్నారు. ఇక అనారోగ్య సమస్య అని తెలియడంత ఆసుపత్రికి వెళ్తున్నారు. అక్కడ వారికి పలురకాల పరీక్షలు చేసి వారినుండి యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని చర్చించుకుంటున్నారు.

అనారోగ్యం అంటూ ఆస్పత్రికి..

కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు అనారోగ్య సమస్యలు ఉన్నవారిని సమకూర్చుకోవడానికి హెల్త్ క్యాంపులకు వెళ్తి బీపీ చెకప్ చేసి చిన్నపాటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి డబ్బులు ఖర్చు కానీ వాటితో



ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నారు. మీకు ఈ అనారోగ్య సమస్య ఉందని, ఆస్పత్రికి వస్తే (రక్త పరీక్ష, మూత్ర పరీక్ష, సిటీ స్కానింగ్, ఎమ్మారై, టుడి ఇకో, ఈసీజీ) పరీక్షలు నిర్వహించి సరైన వైద్యం చేస్తామని చెబుతున్నారు. అనారోగ్య సమస్య ఏదో తెలియని వారు ఆసుపత్రికి వెళ్లే సరికి వారి జేబుకు చిల్లు పడుతోంది.

రక్త పరీక్ష, మూత్ర పరీక్ష అవసరమైతే సిటీ స్కాన్, ఎంఆర్ఐ ఇంకా రకరకాల పరీక్షలు ఏది అవసరమైతే దానిని అనారోగ్య సమస్య అనే పేరుతో ఖర్చు చేయిస్తారు. వారు నిర్వహించిన హెల్త్ క్యాంప్ డబ్బులు అంతా సమకూర్చుకునేందుకు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి దగ్గర నుండి వసూలు చేసేస్తారు. ఇలా వైద్యులు పేషంట్లను ఏ విధంగా క్యాచ్ చేయాలో దానికి తగినట్టుగా వైద్య చికిత్సలో ఉపయోగించే నాడిని ప్రజల దగ్గర ఉన్న ఉచిత హెల్త్ క్యాంప్ అనే దానితో పట్టుకుంటున్నారని పలువురు విద్యావేత్తలు, నిపుణులు అంటున్నారు. నలుగురిలో మంచి పేరు తెచ్చుకోవడానికి కుల సంఘంలో మంచివారు అని అనిపించుకోడానికి హెల్త్ క్యాంపులను ఉపయోగిస్తున్నారు. ఇటువంటి వైద్య చికిత్సలు అందిస్తామని ఉచిత పబ్లిసిటీ చేసుకోవడానికి హెల్త్ క్యాంపులు ఉపయోగపడుతున్నాయని పలువురు అంటున్నారు.

రోగులకోసమే క్యాంప్‌లు..

ఆసుపత్రికి వెళ్తే డాక్టర్లు కన్సల్టేషన్ ఫీజులోనూ, ఆస్పత్రి బిల్లులోను, మెడికల్ బిల్లులో, ఆస్పత్రిలో అడ్మిటై డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఏమాత్రం తగ్గింపు ఇవ్వనివారు ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని ప్రజలకు సందేహం వస్తోంది. దాంతోపాటు ఉచిత మందులు, ఫ్రీ శాంపుల్స్ ని ఉచిత క్యాంపులలో పంపిణీ చేస్తున్నారని అంటున్నారు. అంటే వైద్యులు మార్కెటింగ్ చేయడంలో ఇది ఒక కొత్త పంథాఅని చర్చలు వినిపిస్తున్నాయి. రోగులను రప్పించడానికి, రోగులను గుర్తించడానికి, వారికి అనారోగ్య సమస్యలు ఉన్నాయని తెలియజేయడానికి ఇటువంటి ఉచిత హెల్త్ క్యాంప్ అనే మాట ఎత్తుకున్నారని ప్రజలు నిర్ధారణకు వచ్చారు. ఉచిత క్యాంప్‌లకు కొన్ని చోట్ల స్పందన రాని సందర్భాలు కూడా ఏర్పడ్డాయని పలువురు డాక్టర్లు చర్చించుకుంటున్నారు.

పోచిరామ్‌కు సన్మానం



పోచిరామ్‌ను సన్మానిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

నవతెలంగాణ - పోతంగల్

మండలంలోని చేతన నగర్ గ్రామంలో ఎంఆర్పిఎస్ కమిటీ ఆధ్వర్యంలో, బుధవారం సోంపూర్ పోచిరామ్‌ను బుధవారం పూలమాల, శాలువాతో సన్మానించారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఇటీవల రాష్ట్ర నాయకులు వెంకటస్వామి మాదిగ, జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఎస్‌ఎఫ్ మండల అధ్యక్షులు నక్కేవార్ హరిదాస్ మాట్లాడుతూ.... 25 సంవత్సరాల నుండి మందకృష్ణ మాదిగతో కలిసి, గ్రామ మండల నియోజకవర్గ స్థాయిలో, మాదిగ జాతి కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. సేవలను గుర్తించి రాష్ట్ర జిల్లా నాయకులు జిల్లా కమిటీలో సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని అన్నారు. వారికి పోచిరామ్ ధన్యవాదాలు తెలిపారు. పదవితో మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. కార్య క్రమంలో చైతన్ నగర్ ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు నెక్కెవరి సంజీవ్, పొతంగల్ మండల ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు డ్రైవర్ సాయిలు, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షులు నక్కేవార్ హరిదాస్, సీనియర్ నాయకులు రాజేందర్ నర్సింలు రాజేష్ శివ సురేష్ సంగ్రామ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శంభో.. శివ శంభో

- శివ నామ స్మరణతో మారు మ్రోగిన ఆలయాలు
- ఘనంగా శివపార్వతుల కళ్యాణం

నవతెలంగాణ-కంఠేశ్వర్



శంభో.. శివ శంబో.. శంభో శంకర .. ఓం నమశ్శివాయ అంటూ భక్తుల నామస్మరణతో ఆలయాలు మారుమ్రోగాయి. మహాశి వరాత్రి పర్వదినం సందరంగా ప్రాత: కాలం నుంచే దేవాలయాలకు భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి సుప్రభాతసేవ, అభిషే కాలు, అర్చనల కోసం భక్తులు బారులు తీరారు. శివలింగానికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించే భక్తులతో ఆలయాలు సందడిగా మారాయి. శివునికి భక్తులు జాగరణ చేస్తూ శివనామస్మరణతో గడిపారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాలు కన్నుల పండుగగా నిర్వహించారు.

నీలకంఠేశ్వరాలయంలో...

ఇందూరు కంఠాభరణం అయిన నీలకంటేశ్వర ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివలింగానికి రుద్రాభిషేకం, అభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున్రీ నాలుగు గంటల నుంచి ఆలయంలో అభిషేకాలు కొనసాగాయి. దేవాదాయ సహాయ కమిషనర్ శ్రీరామ్ రవీందర్ గుప్త పర్యవేక్షణలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, అరటి పండ్ల ను పంపిణీ చేశారు.

శంభు లింగేశ్వర ఆలయంలో...

నగరంలోని శంభు లింగేశ్వర ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్త హాజరై శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో భక్తులకు కొబ్బరి స్వీట్, సాబుదాన ప్రసాదం పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బిరెల్లి విజయరావు మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ప్రతి సంవత్సరం భక్తులకు ప్రసాదాన్ని అందజేస్తాము అని తెలిపారు.

మనోకామేశ్వరాలయంలో...

నగరంలోని దేవి రోడ్డు వద్ద గల మనోకామేశ్వరాలయంలో సురేష్ శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని కోట గల్లీలో గల మల్లికార్జున ఆలయంలో శివునికి అభిషేకం ప్రత్యేక పూజలు, సాయంత్రం యజ్ఞం నిర్వహించారు. నగరంలోని పెద్ద బజార్ వద్ద గల నగరేశ్వర ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.


వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ తప్పనిసరి

- అపార్12అంకెలతో డిజిటల్ కార్డు
- పూర్తి సమాచారం అందుబాటులో
- కేజీ టు పీజీ విద్యార్థులకు నమోదు
- జిల్లాలో 321225 మంది విద్యార్థులు

నవతెలంగాణ కంఠేశ్వర్

విద్యార్థులకు సంబంధించిన అకాడమిక్ వివరాలన్నింటిని పొందుపరిచేలా కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో అపార్ కార్డు తీసుకువచ్చింది. ఇందులో వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీని అందిస్తూ కేంద్ర విద్యాశాఖ 12 అంకెలతో డిజిటల్ కార్డును కేటాయిస్తుంది. దీంతో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థుల అకాడమిక్ వివరాలతో పాటు వారి ధృవపత్రాలను ఈ ఆపార్ కార్డు భద్రపరుస్తుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు మొత్తం1786 ఉండగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు 3 లక్షల21వేల2వందల25 మంది ఉన్నారు. 2024-25 లో కేంద్ర ప్రభుత్వం అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ప్రవేశపెట్టింది. ఇందులో పాఠశాల విద్యార్థికి సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. విద్యార్థి అవార్డ్స్, క్వాలిఫికేషన్, డ్రాప్ అవుట్కు సంబంధించిన సమాచారం ఉంటుంది. విద్యార్థి ఎక్కడెక్కడ చదివాడు, ఆధార్ చదువుతున్న పాఠశాలల్లో ఎంట్రీ చేస్తారు. తల్లిదండ్రులతో మాట్లాడి వారితో కాన్సెంట్ ఫామ్ రాసి ఇచ్చిన తర్వాత విద్యార్థి ఆధార్‌తో పాటు తండ్రి లేక తల్లి లేక సంరక్షకుని ఆధార్ కార్డు నెంబరు నమోదు చేస్తారు. విద్యార్థికి ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వడానికి కేజీ నుండి పీజీ వరకు చదివే విద్యార్థులకు సమగ్ర వివరాలు ఈ ఆపార్ కార్డు ద్వారా తెలుస్తాయి. కొన్ని రాష్ట్రాలలో ప్రయోగాత్మకంగా చేశారు. ఈ విద్యా సంవత్సరం దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రవేశపెట్టారు. అపార్‌తో కుటుంబ వివరాలు కూడా తెలుస్తాయి. ఆధార్ సంఖ్యతో పాటు ఈ అపార్ కార్డు జీవితకాలం ఉంటుంది. ఇది ప్రతి విద్యార్థికి ప్రత్యేకమైన 12-అంకెల గుర్తింపు సంఖ్యను అందిస్తుంది. దీని ద్వారా వారి విద్యా ప్రయాణం, సాధనలను డిజిటల్‌గా నిల్వ చేయవచ్చు. ఈ ఐడీ విద్యార్థులకు జీవితకాలం పాటు ఉంటుంది.

విద్యార్థుల అకడమిక్ రికార్డులను ఒకే ప్లాట్‌ఫారమ్‌లో సమీకరించడం, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు రికార్డుల నిర్వహణ




సులభతరం అవుతాయి. పరీక్ష ఫలితాలు, సర్టిఫికెట్లు వంటి అకాడమిక్ డేటాను సురక్షితంగా డిజిటల్గా నిల్వ చేస్తారు. విద్యార్థులు ఒక విద్యా స్థాయి నుండి మరొకదానికి సులభంగా మారేందుకు సహాయపడుతుంది. విద్యాసంస్థల మధ్య క్రెడిట్ల బదిలీని సులభతరం చేయడం, మీ పాఠశాలలో మీ వివరాలను పొందుపరచుకోవాలి. విద్యార్థి మైనర్ అయితే తల్లిదండ్రుల సమ్మతి పొందాలి. ఆధార్ వివరాలను పాఠశాల ద్వారా ధ్రువీకరించుకోవాలి. వేరిఫికేషన్ పూర్తయిన తర్వాత, అపార్ ఐడీ సృష్టించబడి డీజీ లాకర్ ద్వారా అందుబాటులో ఉంటుంది. ఆపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు నెంబరు ఉంటాయి. ఈ కార్డు ద్వారా విద్యార్థులు దేశంలోని ఎక్కడైనా విద్యను కొనసాగించడానికి అవాంతరాలు లేకుండా విద్యా చరిత్రను పొందవచ్చు. అపార్ కార్డు అనేది వన్ నేషన్, వన్ స్టూడెంట్ అని కాన్సెప్ట్ ఆధారంగా గుర్తింపు కార్డుగా ఉంటుంది ఇందుకోసం కేంద్ర విద్యా శాఖ, కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి) 2020 ప్రకారం ఇది ఐడి కార్డు అవుతుంది. ఈ కార్డుకు ఆధార్ కార్డు తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య కూడా ఉంటుంది. ఆధార్ కార్డుతోపాటు ఈ కార్డు విద్యార్థులకు ముఖ్యమైనది. భవిష్యత్తులో వివిధ పాఠశాలల్లో అడ్మిషన్ నుంచి ఉద్యోగాల భర్తీ వరకు విద్యార్థులకు ఈ కార్డు ఉపయోగపడనుంది.

ఆపార్ కార్డు వల్ల ప్రయోజనం ఇలా....

ప్రతి విద్యార్థికి సంబంధించిన పూర్తి సమాచారం డిజిటల్ రూపంలో ఆపార్ కార్డులో సేవ్ చేయడం జరుగుతుంది. విద్యార్థి అన్ని విద, క్రీడలు, స్కాలర్షిప్ సమాచారం ఈ కార్డులో సేవ్ చేసి ఉంటాయి. విద్యార్థి ఎంతవరకు విద్యను పూర్తి చేశాడు. అతనికి ఎలాంటి అవార్డులు, సర్టిఫికెట్లు వచ్చాయి. ఇది వారి విద్యా నాణ్యత, క్రీడా నైపుణ్యాల గురించి సమాచారాన్ని కలిగి ఉంటుంది. విద్యార్థి పాఠశాల మారినప్పటికీ, ఈ రికార్డు అలాగే ఉంటుంది. ప్రతి పాఠశాలలో పూర్తి రికార్డు ఉంటుంది.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఆపార్ త్వరితగతిన పూర్తి చేయాలి
నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి-అశోక్



నిజామాబాద్ జిల్లాలో కేజీ నుంచి టెన్త్ క్లాస్ చదివే విద్యార్థుల డాటాను ఆపార్లో ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలు సకాలంలో పూర్తి చేయాలి. ప్రభుత్వ పాఠశాలలో ఆపార్ నమోదు చేయడంలో ముందున్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా ఆపార్ త్వరగా పూర్తి చేయాలి. ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కళాశాలల విద్యార్థులు సుమారు రెండు లక్షల వరకు ఆపార్‌లో నమోదు చేసుకున్నారు. త్వరితగతిన ప్రతి ఒక్కరూ ఆపార్ నమోదు చేసుకోవాలి. అందుకు అనుగుణంగా పాఠశాలల ప్రిన్సిపల్ లు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తా

- క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించిన ఎమ్మెల్యే
- కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన కాంతారావు

నవతెలంగాణ-జుక్కల్




సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యలు పరిష్కరిం చేందుకు జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు బుధవారం ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరిం చారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలోని పలు మండలాల వచ్చిన ప్రజల నుండి వారి వారి సమస్యలను అడిగి తెలుసుకుని దరఖాస్తు రూపంలో ఎమ్మెల్యేకు సమర్పించగా మిగతావారు డైరెక్టుగా సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వారి సమస్యలను కొంత సమయం తీసుకుని పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే ప్రజలకు తెలియజేశారు. సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఎమ్మెల్యే దరఖాస్తులు స్వీకరించడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఒరవడికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారని, ఇది నిరంతరం కొనసాగిస్తే సమస్యలు తీరుతాయని అభిప్రాయపడుతున్నారు.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్‌లు



కామారెడ్డిలో..

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం సందర్శించారు. నిజామాబాద్ డివిజన్‌కు సంబంధించి నిజామాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఏ.పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్





నిజామాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఆర్టీసీ బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు.

కాగా జిల్లాలో 81 పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓ కార్యాలయాలతో పాటు బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందించామని అన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలలో నేరుగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని, స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలతో పాటు అదనపు సిబ్బందిని నియమించామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

సజావుగా పోలింగ్ నిర్వహించాలి
జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి : ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. నేడు జరుగనున్న మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. 8 రూట్లలో 54 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 48 మంది ప్రెసిడింగ్ అధికారులు, 48 మంది సహాయ ప్రెసైడింగ్ అధికారులు, 116 మంది ఒపిఒలను, 52 మంది మైక్రో పరిశీలకులను నియమించినట్టు తెలిపారు.

పోలింగ్ సిబ్బందికి అందించిన పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలించుకోవాలి, బ్యాలెట్ పత్రాలు, మెటీరియల్, బ్యాలెట్ బాక్స్, తదితర సామాగ్రి లను భద్రంగా పోలింగ్ కేంద్రాలకు తీసుకొన్ని వెళ్లాలని తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని, ప్రతీ రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని తెలియపరచాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ ప్రభాకర్, సీపీఓ రాజారాం, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.